ప్రతి కుటుంబ అభివృద్ధే లక్ష్యం

- సుపరిపాలనపై ఇంటింటికి వెళ్లి ప్రచారం
- ఒక్కొక్కటిగా సూపర్ సిక్స్ పథకాల అమలు
- జిల్లా ఇన్‌చార్జ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని



బిసలమానేపల్లిలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

చిలమత్తూరు/లేపాక్షి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నల్లరాళ్లపల్లిలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సుపరిపాలనను గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? సమస్యలు ఏవైనా ఉన్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర అభివృద్ధిని మరచిపోయిందని విమర్శించారు. దాంతో ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిని పునర్నిర్మించాల్సి వస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపర్చి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా (మిగతా 6వ పేజీలో...)

రావమ్మా.. తుంగభద్రమ్మా..

- నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల (6లో...)



చెత్త దిబ్బలా మారిన షాపింగ్ కాంప్లెక్స్ కింది భాగం



క్లాక్‌టవర్ వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్

కార్పొరేషన్ కాంప్లెక్స్‌లు ?



తాడిపత్రి బస్టాండ్ వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

వాణిజ్య సముదాయాల నిర్వహణ గాలికి

- కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన భవనాలు
- కంపు కొడుతున్న క్లాక్‌టవర్ కాంప్లెక్స్ సెల్లార్
- అద్దె వసూళ్లలో సిబ్బంది చేతివాటం
- మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి గండి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణను గాలికొదిలేశారు. అద్దెలు వసూలు చేస్తున్నారు కానీ వాటి ఆలనా పాలన పట్టించుకోవడం లేదు. నగరంలోని ఐదు ప్రాంతాలతో పాటు మార్కెట్ నుంచి కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.12కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అద్దె వసూలు మాత్రమే తమ బాధ్యత అని రెవెన్యూ విభాగం సిబ్బంది చెబుతుంటూ... తమకేమి సంబంధం లేదన్నట్లుగా ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. ఇక కొన్ని దుకాణాలను అనధికారికంగా అద్దెకిచ్చి, అవి ఖాళీగా ఉన్నట్లు చూపుతూ వచ్చిన అద్దెను కొందరు సిబ్బంది ప్రతి నెలా స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని ఐదు ప్రాంతాల్లో ఉన్న ఏఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌లు అన్నింటిలోనూ ఈ అద్దె గోల్‌మాల్ నడుస్తున్నట్లు ఆశాఖలోనే తోటి సిబ్బంది చెబుతున్నారు. దీని వల్ల మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది. నగరపాలక సంస్థ అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఇలాంటి అక్రమాలు జరుగుతున్నట్లు చర్చ నడుస్తోంది. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణపై బాధ్యత ఉండాలి

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి అద్దె వసూలులో ఉన్న బాధ్యత నిర్వహణపై కూడా ఉండాలి. ఈ విషయంపై ఇప్పటికే అధికారులకు స్పష్టమైన సూచనలు, సలహాలు ఇచ్చాం. అద్దె వసూలు చేయడం, నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదు. ఎవరి విధులు వాళ్లు సక్రమంగా నిర్వహించాలి. శిథిలావస్థకు చేరిన దుకాణాలకు మరమ్మతులు చేయడం, లేదా కూల్చివేసి అక్కడ నూతన భవన నిర్మాణాలపై ఆయా విభాగాల నుంచి నివేదికలు తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.



\- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



ఐదు ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు

అనంత నగర పాలక సంస్థకు సంబంధించి నగరంలో ఐదు ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్ లు ఉన్నాయి. టవర్‌క్లాక్ వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో 208 దుకాణాలు ఉన్నాయి. వీటిని మొత్తం అద్దెకిచ్చారు. ఇందులో కొన్ని షాపుల వద్ద అటు ఇటుగా వెళ్లడానికి వీలు లేకుండా అడ్డంగా ఇనుపకంచెలు వేసేశారు. దీంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆయా షాపుల వద్దకు వెళ్లడానికి మొత్తం తిరిగి రావాల్సిన పరిస్థితి ఉంది. ఇక కిందివైపున సెల్లార్‌లో పార్కింగ్, ఇతర చిరువ్యాపారులకు అద్దెకివ్వడానికి అనువుగా ఉంది. అయితే నిర్వహణలోపంతో అది చెత్తదిబ్బలు, మందు బాబులకు అడ్డాగా మారింది. దీంతో ఆ ప్రాంతం కంపు కొడుతోంది. ఇక సప్తగిరిసర్కిల్ లో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉండే కాంప్లెక్స్‌లో 24షాపులు ఉన్నాయి. వీటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో శిథిలావస్థ కు చేరాయి. ఇక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఎదురుగా 47షాపులు ఉన్నాయి. అన్నింటిని అద్దె కి ఇచ్చారు. తాడిపత్రి బస్టాండ్‌లో ఎదురెదురుగా మొత్తం 52షాపులు ఉన్నాయి. ఇవి శిథిలావస్థకు చేరడంతో కింది షాపులన్నీ అద్దెకిచ్చారు. మొదటి అంతస్తులో కొన్ని షాపులు మాత్రమే అద్దె చెల్లిస్తున్నారు. అదే ప్రాంతంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద మరో 18షాపులు ఉన్నాయి. పాతూరుతో పాటు ఆయా ప్రాంతాల్లోని బహిరంగంగా నిర్వహించుకుంటున్న చిరు వ్యాపారులు, పాతూరు మార్కెట్ నుంచి ఏడాదికి రూ.87లక్షలు ఆదాయం వస్తోంది. ఇంత ఆదాయం వస్తున్నా నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది.

విశ్వాసం పెంచేలా విధులు

ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచండి

గంజాయి, మట్కా, పేకాటపై దృష్టి పెట్టండి

నేర సమీక్షలో ఎస్పీ జగదీష్



అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెంచేలా పని చేయాలనీ, వారితో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ జగదీష్. పోలీసు అధికారులను ఆదేశించారు. గంజాయి, మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలనీ, రాంగ్ రూట్, ఓవర్‌లోడ్, ట్రిపుల్ రైడ్, ఇతర ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై ఫైన్లు వేయాలని ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జగదీష్. ఆరు నెలల నేరాలపై సమీక్ష నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, హత్య, పోక్సో, అత్యాచారం, డెకాయిట్, చోరీ, వాహనాల చోరీలు, చీటింగ్, అదృశ్యం, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సర్కిళ్ల వారీగా ఎస్పీ సమీక్ష చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... పోలీసులు.. ప్రజలతో మమేకం కావాలన్నారు. అప్పుడే వారిలో పోలీసులపై సదభిప్రాయం ఏర్పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని బ్లాక్ స్పాట్స్‌ను సందర్శించి హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలు, సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పలు కేసులను త్వరితగతిన ఛేదించడం, నిందితులను వెంటనే అరెస్టు చేయడంలో చొరవ చూపిన పోలీసులను ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, రవిబాబు, శ్రీనివాస్, మహబూబ్ బాషా, నీలకంఠేశ్వరరెడ్డి, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు.. వద్దే వద్దు..!

- ట్రాక్టర్లతో ప్రజలు, రైతుల ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



ర్యాలీగా వెళ్తున్న ప్రజలు, రైతులు

అనంతపురం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డు వద్దే.. వద్దు అంటూ మండలంలోని పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంలో బుధవారం భారీ ఎత్తున ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టారు. మండలంలోని నరసనాయనికుంట గ్రామ సమీపాన డంపింగ్ యార్డుకు సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. నరసనాయనికుంటతోపాటు చుట్టుపక్కల గ్రామాలైన కొడిమి, నాగిరెడ్డిపల్లి, నారాయణపురం ప్రజలు, రైతులు నిరసన చేపట్టారు. మండలంలోని తపోవనం సర్కిల్ నుంచి బైక్‌లు, ట్రాక్టర్లతో ర్యాలీ మొదలెట్టారు. బళ్లారి బైపాస్ సర్కిల్, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగించారు. కలెక్టరేట్ ఎదటు బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి, వినతిపత్రం ఇచ్చారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో కలిగే అనర్థాలను ఆయనకు వివరించారు. కొడిమి గ్రామ సర్వే నంబరు 263, నారాయణపురం సర్వే నెంబరు 58లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం ఎంపిక చేసుకున్నారన్నారు. స్థలం నరసనాయనికుంట గ్రామానికి 100 మీటర్లు, నాగిరెడ్డిపల్లికి కిలోమీటరు, నారాయణపురానికి 300మీటర్ల దూరంలో ఉందన్నారు. భవిష్యత్తులో ఈ స్థలం సమీపంలో రింగ్ రోడ్డు వచ్చే అవకాశం ఉందన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి వచ్చే దుర్వాసన, కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారినపడి మంచం పట్టాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ, పాడిపశులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఇప్పటికే బళ్లారి రోడ్డులోని ఓ ఫ్యాక్టరీ నుంచి వెలువడే ఘాటు, వాసన భరించలేకపోతున్నామన్నారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే దుర్వాసన, పొగ కారణంగా వ్యాధుల బారిన పడాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.



ట్రాక్టర్లలో ర్యాలీగా వస్తున్న ప్రజలు, రైతులు

అక్రమాలు నిజం.. రికవరీ చేయం..!

- ఉపాధి పనుల్లో అవినీతిని నిగ్గుతేల్చారు
- సొమ్ము రికవరీపై నోరు మెదపరు (6లో..)

హంద్రీనీవా సిద్ధం

నేటి నుంచి ఎత్తిపోతలు ప్రారంభం

- పనులను తనిఖీ చేసిన ఎస్ఈ
- మిగిలిన పనులు వచ్చే సీజన్‌లోనే..
- నీటి పారుదలకు తొలగిన ఆటంకాలు



జి.కొట్టాల వద్ద హంద్రీనీవా కాలువలో పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నీటి ఎత్తిపోతలకు హంద్రీనీవా కాలువ సిద్ధమయింది. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ఇంజనీరింగ్ అధికారులు రికార్డు స్థాయిలో పూర్తి చేయించారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్టుగానే కాలువ వెడల్పు పనులను అనుకున్న సమయానికే పూర్తిచేశారు. వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవాలో తట్ట మట్టినీ తీయలేదని ఎద్దేవాచేసిన టీడీపీ నేతలు.. తాము చేసి చూపుతామని ఇచ్చిన హామీ మేరకు అనుకున్న సమయానికే వెడల్పు పనులను పూర్తిచేసి చూపారు. వెడల్పు పనులు కొంత మేరకు మిగిలి ఉన్నాయి. బండ్ వైడెనింగ్, డీప్‌కట్ వైడెనింగ్ పనులు వంద శాతం పూర్తిచేయగా.. బండ్ లైనింగ్ పనులు కొంతమేర జరిగాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో హంద్రీనీవాకు ఎత్తిపోతలు ప్రారంభమయ్యే సమయం సమీపించడంతో లైనింగ్ పనులను నిలిపివేశారు. గురువారం మల్యాల 1వ నంబరు పంప్ హౌస్ వద్ద నీటి ఎత్తిపోతల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు హంద్రీనీవా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ స్వరూప్ కుమార్ (మిగతా 6వ పేజీలో..)

నవీన్ నిశ్చల్‌పై సస్పెన్షన్ వేటు

- కొండూరు వేణు.. మరో నలుగురిపై కూడా..
- క్రమశిక్షణ ఉల్లంఘనల పేరిట వైసీపీ చర్యలు



నవీన్ నిశ్చల్



కొండూరు వేణుగోపాలరెడ్డి

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్‌ను వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఆయనతోపాటు పార్టీ హిందూపురం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి, బి.బ్లాక్ అధ్యక్షుడు సీఎన్‌పీ నాగరాజు, 17, 31 వార్డు కౌన్సిలర్లు మజాన్, చిన్నమ్మ, పార్టీ నాయకుడు హబీబ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ప్రకటించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు సన్నిహితులైన నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడటం పార్టీలో కలకలం రేపుతోంది. ఈ నెల 8న వైఎస్సార్ జయంతిని హిందూపురంలో పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోయి నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పార్టీ కార్యాలయం వద్ద, నవీన్ నిశ్చల్ టీచర్స్ కాలనీలో నివాళులు (మిగతా 6వ పేజీలో...)

మళ్లీ వాయిదా..

రామగిరి ఎంపీపీ ఉప ఎన్నికకు ఇద్దరే హాజరు



ఉప ఎన్నికకు హాజరైన ఇద్దరు సభ్యులు, ఎన్నికల అధికారి సంజీవయ్య

రామగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ఉప ఎన్నికకు మూడోసారి నోటిఫికేషన్ విడుదల కాగా, సభ్యులకు అధికారులు నోటీసులు కూడా అందజేశారు. అయినా ఎన్నికల్లో ఎవరూ పాల్గొనలేదు. టీడీపీ సభ్యులు ఒకరు, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన మరొకరు మాత్రమే హాజరయ్యారు. నిర్దేశించిన సమయానికి చాలినంత మంది సభ్యులు హాజరు కాలేదు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్ అయింది. మహిళా ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. ఈ పరిస్థితుల్లో కోరం లేక ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. వైసీపీ సభ్యులు పదేపదే గైర్హాజరవుతుండటంతో ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. ఎన్నికకు ముందే వైసీపీ సభ్యులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. అయినా ఎన్నికకు హాజరవుతారన్న ఉద్దేశంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటుచేశారు. దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఊహించిన విధంగానే వాయిదాపడిందని ప్రజలు చర్చించుకున్నారు.

ఫుల్లు కిక్కు..!

భారీగా పెరిగిన మద్యం విక్రయాలు (7లో..)

రావమ్మా.. తుంగభద్రమ్మా..!

నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల

రాయదుర్గం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)కి గురువారం నీరు విడుదల చేయనున్నట్లు బోర్డు ఎస్ఈ నారాయణనాయక్ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కర్ణాటకకు సంబంధించిన వాటా నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. వారం క్రితం నీరు విడుదల చేయడంతో ఆంధ్ర సరిహద్దులోని 105 కి.మీ. వద్ద జలాలు వచ్చి నిలువ ఉన్నాయి. కర్ణాటక వాటా కింద రోజుకు 700 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర వాటా కింద రోజుకు 500 క్యూసెక్కుల నీరు వదలాలని హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి బుధవారం సాయంత్రం బోర్డుకు ఇండెంట్ సమర్పించారు. దీంతో గురువారం ఉదయం ముహూర్తం చూసుకుని సరిహద్దులో నిల్వ ఉన్న జలాలను దించిన రెగ్యులేటర్‌ను ఎత్తి, ఆంధ్ర జలాలను విడుదల చేసేలా బోర్డు సరిహద్దు డీఈకి ఆదేశించారు. కాలువ మరమ్మతులు, అడ్డుగా ఉన్న మట్టి, రాళ్ల తొలగింపు పూర్తవడంతో నీరు విడుదల చేయనున్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేదని క్షేత్రస్థాయి అధికారులు కాలువపై గస్తీ నిర్వహించి, గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో గురువారం నుంచి హెచ్చెల్సీ జలాలు ఆంధ్రలో ప్రవహించనున్నాయి.

మార్గదర్శకుల గుర్తింపు వేగవంతం చేయాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పీ4 అమలులో భాగంగా మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలనీ, లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి పీ4 కార్యక్రమంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పీ4 కింద జిల్లాలో 68,381 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇందులో దాతల (మార్గదర్శకుల)కు ఇప్పటివరకు 18,396 మందిని దత్తత ఇచ్చామన్నారు. ఇంకా 45,985 మంది బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందు కోసం మార్గదర్శకులను గుర్తించాలనీ, ఈ విషయంలో అవగాహన కల్పించాలని కలెక్టర్ వివరించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

అనంతపురం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలను 15రోజుల్లోగా సంబంధిత అన్ని శాఖల అధికారులు తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలన్నారు. తనిఖీ విషయంలో అలసత్వం ఉండరాదన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తహసీల్దార్ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలన్నారు. అభివృద్ధి పనులకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు నాటు వైద్యం వద్దు

● డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, నాటు వైద్యాన్ని పురిటిపిల్లలపై ప్రయోగించడం ద్వారా ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జూన్‌లో మాతాశిశు మరణాలపై బుధవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి మాట్లాడుతూ.. శిశు, మాతృ మరణానికి కారణాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. అలాంటి సమస్యలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం ఆరువారాల నుంచి, ఆరు నెలలపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని సంపూర్ణంగా తీసుకుంటే రక్తహీనత దరిచేరదన్నారు. గర్భిణులకు అన్నిరకాల ఆరోగ్యపరీక్షలు సక్రమంగా నిర్వహించి, ఎప్పటికప్పుడు తగిన వైద్యసేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు యుగంధర్, మధుసూదన్, ప్రణీత్, ఇందిర, సీహెచ్ఓలు పాల్గొన్నారు.

బడిలో బువ్వ కష్టాలు..!





క్యారియర్ తెచ్చుకుని భోజనం తింటున్న విద్యార్థులు

- దర్శినమల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల అవస్థలు
- మానేసిన భోజన ఏజెన్సీ నిర్వాహకులు
- 9 రోజులు వండి వడ్డించిన ఉపాధ్యాయులు
- తర్వాత చేతులెత్తేసిన వైనం
- ఇంటి నుంచే క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

ధర్మవరంరూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి):మండలంలోని దర్శినమల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వదిలేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఉపాధ్యాయులే 9 రోజులపాటు వంట వండి, వడ్డించారు. వారు కూడా ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. సమస్యను ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే క్యారియర్లు తెచ్చుకుని, భోజనం చేయాల్సి వచ్చింది. దీంతో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు.. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎంఈఓ గోపాల్‌నాయక్ పాఠశాలకు చేరుకుని ఆరాతీశారు. గ్రామపెద్దలతో మాట్లాడి రామాంజనేయులు అనే వ్యక్తికి తాత్కాలికంగా ఏజెన్సీ నిర్వహణను అప్పగించారు.

దీపం సొమ్ము అందరికీ అందేలా చూడండి

● టీడీపీ నాయకులకు రఘువీరా సూచన



మాజీ మంత్రి రఘువీరారెడ్డికి కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, జూలై16 (ఆంధ్రజ్యోతి): సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, టీడీపీ నాయకుల మధ్య ఆసక్తికర సంభాషణ సాగింది. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం గ్రామంలోని రఘువీరా ఇంటికి టీడీపీ నాయకులు బుధవారం వెళ్లారు. వారిని రఘువీరారెడ్డి ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని టీడీపీ నాయకులు అందజేశారు. దానిని తీసుకున్న రఘువీరా.. అందులోని పథకాలన్నింటినీ క్షుణ్ణంగా చదివారు. 'అన్నీ బాగున్నాయి కానీ, కొంతమందికి దీపం పథకం కింద గ్యాస్ సబ్సిడీ డబ్బులు జమ కాలేదనీ, వారికి వచ్చేలా చూడాల'ని నాయకులకు సూచించారు. దీంతో వారు సరేనంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవి, రంగేగౌడ్, ఆనంద్, రాజు, గోవర్ధన్, రంగనాథ్ పాల్గొన్నారు.

26 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు

శెట్టూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకొడికి గ్రామానికి చెందిన 26 మందిపై పోలీసులు బుధవారం ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పీర్ల చావిడిలోకి ఎస్సీలు రాకూడదని బీసీ వర్గానికి చెందిన వారు శనివారం వాదనకు దిగారు. దళిత వర్గానికి చెందిన గంగాధర్ చావిడిలోకి వెళ్లేందుకు యత్నించగా.. బీసీ వర్గానికి చెందిన 26 మంది.. అతడిపై దాడి చేసి, గాయపరిచారు. దీనిపై బాధితుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా పోలీసులు.. దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడంతో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాధితులు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో దాడి చేసిన 26 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ రాంభూపాల్ తెలిపారు.

జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

అనంతపురం కలెక్టరేట్ జూలై 16(ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రిడిటేషన్లు కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం కింద రూ.1250 www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలన్నారు. జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రతి కుటుంబ అభివృద్ధే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

లభిస్తాయన్నారు. ప్రతి గ్రామానికి శ్మశానవాటికను ఏర్పాటు చేస్తామన్నారు. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కార్యక్రమం చేపడతామన్నారు. దివంగత ఎన్టీఆర్ హిందూపురం ప్రాంత అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన అడుగుజాడల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ నడుస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో హిందూపురం ప్రాంతం మెగా పారిశ్రామిక వాడగా నిలుస్తుందన్నారు. అంతకుముందు ఆయనకు ఎంపీ పార్థసారథి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కల్లుకుంట అంజినప్ప, మండల కన్వీనర్ శ్రీనివాసులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు.



చిలమత్తూరు మండలం నల్లరాళ్లపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

లేపాక్షి మండలంలోని బిసలమానేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావుతో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లారు. కరపత్రాలను అందిస్తూ ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. రెండు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు డాక్టర్ సురేంద్ర, కోడూరు సర్పంచ్ మురళీమోహన్, గంగాధర్, కురుబ చంద్రశేఖర్ లేపాక్షి నాయకులు గ్రీన్‌పార్క్ నాగరాజు, మండల కన్వీనర్ వెంకటాపురం అబి, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నవీన్ నిశ్చల్‌పై సస్పెన్షన్ వేటు

(5వ పేజీ తరువాయి)

అర్పించారు. కొండూరు వేణుగోపాలరెడ్డి మరోచోట కార్యక్రమం నిర్వహించారు. అదే రోజు హిందూపురానికి వచ్చి పార్టీ పరిశీలకుడు రమేష్ రెడ్డి, క్రమశిక్షణ ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విషయాన్ని పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీపిక, ఆమె భర్త వేణురెడ్డి బుధవారం తాడేపల్లికి వెళ్లి జగన్‌ను కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ వ్యవహారాల గురించి జగన్‌కు వివరించారు. అంతకు ముందు రోజు.. మంగళవారం రాత్రే సీఎన్‌పీ నాగరాజు, ఇద్దరు కౌన్సిలర్లు, ఓ నాయకుడిని సస్పెండ్ చేశారు. దీంతో పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నవీన్ నిశ్చల్, వేణుగోపాలరెడ్డిపై చర్యలు తీసుకోకుండా, దళితులు, మైనార్టీలపై చర్యలు తీసుకోవడం ఏమిటని ఆ పార్టీ నాయకులు ప్రశ్నించారు. ఈ క్రమంలో దీపిక, వేణురెడ్డి జగన్‌ను కలిశాక నవీన్ నిశ్చల్, వేణుగోపాలరెడ్డిని బుధవారం రాత్రి సస్పెండ్ చేశారు.

వైసీపీలో కలకలం..

నవీన్ నిశ్చల్ 40 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నారు. ఎక్కువకాలం కాంగ్రెస్‌ను అంటిపెట్టుకున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా హిందూపురంలో బరిలోకి దిగారు. కాంగ్రెస్ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు సంపాదించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఆశించారు. కానీ ఆఖరి క్షణంలో రిటైర్డ్ పోలీస్ అధికారి షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు టిక్కెట్ ఇచ్చారు. అయినా వైసీపీలోనే ఉంటూ వచ్చిన ఆయనకు రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. వైసీపీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆ పదవి దక్కిందని చెబుతారు.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో గతంలో పలుమార్లు సస్పెండ్ అవుతారనే ప్రచారం జరిగింది. కానీ ఎన్నడూ చర్యలు తీసుకోలేదు. అయితే ఇప్పుడు వేటు పడింది. దీపిక, వేణురెడ్డి పట్టుపట్టి అతన్ని సస్పెండ్ చేయించారని సమాచారం. నవీన్‌పై చర్యలతో దీపిక వర్గంలో ఎక్కడలేని ఉత్సాహం కనిపిస్తోంది. కొండూరు వేణుగోపాలరెడ్డి కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి కాంగ్రెస్‌లో ఉన్నారు. వైఎస్ కుటుంబంతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతుంటారు. వైసీపీ ఆవిర్భావ సమయంలో కాంగ్రెస్‌ను వీడి.. పార్టీలో చేరారు. హిందూపురం నియోజకవర్గానికి ఆయన వైసీపీ రెండో సమన్వయకర్త. ఆయనపైనా సస్పెన్షన్ వేటు పడింది.

సారోళ్లకు.. ప్రజలే సేవకులు..!

- ధ్రువపత్రాల జారీలో వీఆర్వోల నిర్లక్ష్యం
- సంతకాలతో సరిపెడుతున్న వైనం
- మిగతా ప్రక్రియ దరఖాస్తుదారులదే..
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజల ప్రదక్షిణ



అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు

అనంతపురం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్వో)లు దర్పం ప్రదర్శిస్తున్నారు. తాము చేయాల్సిన పనులను సైతం ప్రజలతో చేయిస్తున్నారు. ధ్రువపత్రాల జారీలో ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్నారు. సంతకాలు చేసి, చేతులు దులుపుకుంటున్నారు. మిగతా ప్రక్రియ దరఖాస్తుదారులకే అప్పజెబుతున్నారు. దీంతో వారు రోజులపాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రస్తుతం విద్యాసంస్థల్లో ప్రవేశాలకు వివిధ సర్టిఫికెట్లు అవసరమవుతున్నాయి. ఈక్రమంలో రోజువారీగా అనంతపురం అర్బన్, రూరల్ కార్యాలయాలకు వందల సంఖ్యలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. సర్టిఫికెట్లు సకాలంలో జారీ కాకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకే పనులు..

అర్బన్, రూరల్ కార్యాలయాల్లో కుల ధ్రువీకరణ, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ ఇతరత్రా సర్టిఫికెట్ల జారీకి తహసీల్దార్లు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సచివాలయాలు, మీసేవ సెంటర్లలో ధ్రువపత్రాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను వీఆర్వోలు డౌన్‌లోడ్ చేసుకుని, వాటికి చెక్‌లిస్టు తీసుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. ఆ తరువాత సంతకాలు చేసి పైస్థాయి అధికారులకు రెఫర్ చేయాల్సి ఉంది. తద్వారా అప్లికేషన్లను తహసీల్దార్ కార్యాలయంలోని రిజిస్టర్‌లో నమోదు చేసి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్‌తో సంతకాలు చేయించాలి. అనంతరం చెక్‌లిస్టును ఆన్‌లైన్‌లో స్కాన్ చేయించి కంప్యూటర్ ఆపరేటర్లతో అప్రూవల్ చేయించాల్సి ఉంది. ఈ పనులన్నీ వీఆర్వోలు చేయాలి. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా సాగుతోంది. దరఖాస్తుదారులే ఈ పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

సర్టిఫికెట్ల కోసం ప్రజలు సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న తరువాత వీఆర్వోల వద్దకు తీసుకెళ్తున్నారు. కొంతమంది వీఆర్వోలు సంతకాలు పెట్టి, దరఖాస్తుదారుల ద్వారానే వాటిని తహసీల్దార్ కార్యాలయాలకు పంపుతున్నారు. చెక్‌లిస్టులను కూడా దరఖాస్తుదారులతోనే తెప్పించుకుని సంతకాలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. మరి కొంతమంది దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగైదురోజులైనా ఆన్‌లైన్‌లోని సర్టిఫికెట్లను ఫార్వార్డ్ చేయని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో దరఖాస్తుదారులు అప్లికేషన్లను చేతబట్టుకుని తహసీల్దార్ కార్యాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు. అక్కడ ఆర్ఐ, తహసీల్దార్ సంతకాలు తప్పనిసరి. వారిలో ఎవరు లేకున్నా ధ్రువపత్రాలు మంజూరుకావు. సమయానికి అధికారులుంటే సరి.. లేదంటే.. మరో రోజు కార్యాలయానికి అప్లికేషన్ పట్టుకుని, వెళ్లాల్సి ఉంటుంది. ఈక్రమంలో సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందంటూ దరఖాస్తుదారులు వాపోతున్నారు. దీనిపై నిలదీస్తే సర్టిఫికేట్ల జారీకి వారం, నెల రోజులు సమయం ఉందని చెబుతూ ఆఫీసులు చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు.

అక్రమాలు నిజం.. రికవరీ చేయం..!

డ్వామా అధికారుల తీరుపై విమర్శలు

● ఉపాధి పనుల్లో అవినీతి నిగ్గుతేల్చారు ● ప్రజావేదికలోనే ప్రకటించారు..

సొమ్ము వసూలులో మాత్రం నిర్లక్ష్యం



అక్రమాలను డ్వామా పీడీ సలీం బాషాకు వివరిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు (ఫైల్)

కళ్యాణదుర్గం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను సాక్షాత్తు డ్వామా అధికారులే తేల్చారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలోనే ప్రకటించారు. పక్కదారి పట్టిన ప్రజాధనాన్ని రికవరీ మాత్రం చేయరు, శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోరు. ఎందుకో, ఏమో..? నెలలు గడుస్తున్నా.. ఆ ఊసే ఎత్తరు. ప్రజాధనమే కదా, పోనీలే అనుకున్నారో.. ఏమో.. డ్వామా ఉన్నతాధికారులే సెలవియ్యాలి. కంబదూరు మండలంలో వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వసతి గృహాల్లో పనిచేసే ఉద్యోగులను కూడా ఉపాధి కూలీలుగా చూపించి, ఉపాధి నిధులను ఎంచక్కా స్వాహా చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న కంబదూరులో నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలోనే అధికారులు అవినీతిని బయట పెట్టారు. డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ సుధాకర్ రెడ్డి, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రజావేదికను అప్పట్లో నిర్వహించినా ఇంతవరకు రికవరీ అతీగతీ లేదన్న విమర్శలు లేకపోలేదు.

మొక్కల మాటున స్వాహా

కంబదూరు మండలంలో 2023-24 ఏడాదిలో ఉపాధి హామీ పనులకు రూ.6 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు రూ.2 కోట్లు ఖర్చు చేశారు. అందుల్లో అక్రమాలకు అంతేలేదన్న ఆరోపణలున్నాయి. సామాజిక తనిఖీ బృందం సభ్యులు కూడా తనిఖీలు చేపట్టారు. రూ.4.02 లక్షలు రికవరీ చేస్తున్నట్లు అధికారులు స్వయంగా ప్రకటించారు. నెలలు గడుస్తున్నా.. నేటికీ అతీగతీలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కంబదూరు మండలంలోని 12 పంచాయతీల్లో పనిచేసే కొంతమంది వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు... వసతి గృహాల్లో పనిచేసే ఉద్యోగులను ఉపాధి కూలీలుగా చూపించి, మస్టర్లలో పేర్లు రాసి నిధులను స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులే క్షేత్రస్థాయికి వెళ్లి గుర్తించారు. ఇలా రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలదాకా నిధులు దుర్వినియోగమైనట్లు బయటపడింది. పండ్ల మొక్కలు లేకున్నా, ఉన్నట్లుగా చూపించి నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. వైసీపీ హయాంలో రూ.2 కోట్లకు పైబడి ఖర్చు చేసి పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సీసీరోడ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల ప్రహరీల పనులు చేపట్టారు. ఇందులో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఈ పనుల వివరాలు వెల్లడించకుండా మౌనం వహిస్తున్నారు. పనులు అర్థాంతరంగా ఆగిపోయాయా, పూర్తయ్యాయా, నిధులు పక్కదారి పట్టాయా అన్న వివరాలేవీ నేటికీ బహిర్గతం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు వాటి గురించి చెప్పేవారే కరువయ్యారు. అసలు రికవరీ చేస్తారా, అటకెక్కిస్తారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పనుల్లో తేల్చిన అక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రికవరీకి ఆదేశిస్తాం

ఉపాధి హామీ రికార్డులను పరిశీలిస్తాం. పక్కదారి పట్టిన నిధుల రికవరీకి ఆదేశాలు జారీ చేస్తాం. - **సూర్యనారాయణ, ఎంపీడీఓ, కంబదూరు**

హంద్రీనీవా సిద్ధం

(5వ పేజీ తరువాయి)

కాలువలో పనుల అంతిమ పరిస్థితిని పరిశీలించారు. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన పనులపై కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు.

లైనింగ్ పనులు నిలుస్తాయా..?

హంద్రీనీవా వెడల్పు పనుల్లో భాగంగా మట్టికట్టలు, డీప్‌కట్ పనులు పూర్తవుతాయని, లైనింగ్ పనులు ఈసారికి పెండింగేనని ఇంజనీర్లు తొలుత భావించారు. కానీ ఈ నెలలో హుటాహుటిన బండ్ లైనింగ్ పనులను చేపట్టారు. కొన్నిచోట్ల లైనింగ్ పనులు రికార్డు స్థాయిలో చేపట్టి పూర్తిచేశారు. గుంతకల్లు మండలంలోని జి.కొట్టాల గ్రామం వద్ద ఒక గట్టుకు లైనింగ్ చేపట్టగా, ఆ పనులు పూర్తయ్యే పరిస్థితులు లేవు. గురువారం పంపింగ్ ప్రారంభమైతే ఈ నెల 20 లేదా 21వ తేదీన కాలువలో కృష్ణానీరు జిల్లాలోకి ప్రవేశిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు లైనింగ్ పనులు మరో రెండు రోజులు మాత్రమే చేపట్టే వీలుంది. ఈ కొంచెం సమయంలో లైనింగ్ పనులు పూర్తికావు. లైనింగ్ కాంక్రీటుకు క్యూరింగ్ తగినంత సమయం లేనందున అతి వేగంగా పారే నీటికి సిమెంటు నిర్మాణం తట్టుకుంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బుగ్గసంగాల, కసాపురం గ్రామాల వద్ద ఉన్న మట్టికట్టలకు లైనింగ్ పనులను ప్రారంభించలేదు. చేపట్టిని లైనింగ్ వర్కులన్నీ వచ్చే సీజన్‌కు వాయిదాపడ్డాయి.



కసాపురం వద్ద పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ

పనులను పరిశీలించిన ఎస్ఈ

హంద్రీనీవా కాలువలో గురువారం ఎత్తిపోతలు ప్రారంభించడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో.. నీటి పారుదలకు సమస్య ఏర్పడకుండా చేపట్టాల్సిన పనులను ఎస్ఈ రాజాస్వరూప్ కుమార్, గుంతకల్లు ఏరియా ఈఈ శ్రీనివాస నాయక్ బుధవారం పరిశీలించారు. కాలువలో 134 కి.మీ. నుంచి 146 కి.మీ. వరకూ పనులను తనిఖీ చేశారు. ఈ నెల 20వ తేదీకల్లా జిల్లాలోకి సాగునీరు వచ్చే పరిస్థితులు ఉన్నందున బెడ్డింగ్ వర్కులన్నీ వెంటనే పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటి పారుదలకు ఎలాంటి ఆటంకం లేకుండా వెడల్పు పనులన్నీ పూర్తి చేశామని తెలిపారు. లైనింగ్ వర్కులు మాత్రమే మిగిలి ఉన్నాయని, మిగిలిన పనులను వచ్చే సీజన్‌లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వెడల్పు పనులను సకాలంలో పూర్తి చేశామని అన్నారు. కాలువ గట్లపై జీప్ ట్రాక్ పనులను చేపట్టాల్సి ఉందని, నీరు వచ్చాక వాటిని పూర్తి చేస్తామని తెలిపారు.

రహదారిపై యువకుడి మృతదేహం

ఛిద్రమైన తల, మొండెం

రోడ్డు ప్రమాదమా..? చంపి పడేశారా..?

బుక్కరాయసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం-అమరావతి హైవేపై (544డి) గుర్తుతెలియని యువకుడు బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయకొట్టాల గ్రామ శివారులో రహదారిపై 25 నుంచి 30 ఏళ్లలోపు యువకుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకుడి చేతిపై సినీ హీరో అల్లుఅర్జున్ ఐకాన్ ఏఏ టాటూ వేయించుకున్నాడని, మరో చేతిపై ఎస్ అనే అక్షరం ఉందని పోలీసులు తెలిపారు. అతడి మొండెం తెగిపోవడం, మొహం ఛిద్రం కావడంతో గుర్తుపట్టని విధంగా ఉన్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా? ఎవరైనా హత్య చేసి రోడ్డుపై పడేసి వెళ్లారా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఆ సమయంలో నడిచి ఎందుకు వచ్చాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చిగిచెర్ల నారాయణ(ఫైల్)

నార్పల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడ్డం నాగేపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణ(64) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నారాయణకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఐదేళ్ల నుంచి అరటి, మిరప సాగు చేస్తూ నష్టపోయాడు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ.8 లక్షలు, దానిపై వడ్డీ తీర్చలేకపోయారు. ఈ ఒత్తిడితో ఈ నెల 10న ఇంట్లో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కోలుకోలేక బుధవారం మృతిచెందారు. ఆయనకు భార్య సుశీలమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఒకే రోజు 10 ఇళ్లలో చోరీ


దొంగతనానికి ఉపయోగించిన కడ్డీ

పుట్టపర్తి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఒకే రోజు పది ఇళ్లలో చోరీలు జరిగాయి. బుధవారం తెల్లవారుజామున శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లో 10 ఇళ్లలో భారీఎత్తున నగదు, బంగారు నగలను అపహరించారు. రాత్రి విధులు ముగించుకుని ఉదయం ఇంటికి వచ్చిన సిబ్బంది తమ ఇళ్ల, బీరువాల తాళాలను దుండగులు పగులగొట్టినట్లు గుర్తించారు. తమ ఇళ్లలో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. దుండగులు చోరీకి పాల్పడిన ప్రాంతానికి సమీపంలో కలెక్టర్ బంగ్లా కూడా ఉండటం గమనార్హం. నిరంతరం సెక్యూరిటీ ఉండే ప్రాంతంలో భారీ చోరీ జరగడంతో పోలీసుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే తరహాలో గత ఏడాది పట్టణానికి సమీపంలోని సందీప్‌విల్లాలో కూడా రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన దుండగులు భారీగా బంగారు నగలు అపహరించుకుపోయారు. నేటికీ ఆ కేసును పోలీసులు ఛేదించలేకపోయారు. భారీ దొంగతనం జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలని కోరుతున్నారు. ఈ ఘటనపై రూరల్ ఎస్సై లింగన్నను వివరణ కోరగా బంగారు నగలు, నగదు ఎంత చోరీ అయ్యిందో ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. చోరీ సమాచారంపై తాము ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి


సువర్ణమ్మ (ఫైల్)

ముదిగుబ్బ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధన్నగారిపల్లి లో పాముకాటుతో మహిళా రైతు సువర్ణమ్మ(44) బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ నాగభూషణం పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు సిద్ధన్నగారిపల్లికి చెందిన శివారెడ్డి భార్య సువర్ణమ్మ భర్తతో కలిసి చీనీ తోటలో కలుపు తీస్తుండగా చేతికి పాము కాటేసింది. వెంటనే ప్రైవేటు వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా ఆమె మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడూ..! అమ్మ జాగ్రత్త

● వీడియో కాల్ చేసి.. అన్న ఆత్మహత్య


రేవంత్‌కుమార్ (ఫైల్)

గుత్తి రూరల్/ పెబ్బేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ్ముడూ అమ్మ జాగ్రత్త... అంటూ ఒక అన్న వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో చోటుచేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలను ఎస్సై గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం పి కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణకు రేవంత్ కుమార్ (27), కిరణ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల కిందట తండ్రి మృతి చెందటంతో పెద్ద కుమారుడు రేవంత్ కుమార్ ఇంటి బాధ్యతలను చూసుకుంటున్నాడు. గుత్తి మార్కెట్ నుంచి తన బొలెరో వాహనంలో పచ్చిమిర్చిని తీసుకొని నిజామాబాద్‌కు బయలుదేరాడు. మంగళవారం సాయంత్రం వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ సమీపంలోని కొత్తకోట బైపాస్ జాతీయ రహదారిపై తన వాహనాన్ని నిలిపాడు. తన తమ్ముడు కిరణ్ కుమార్‌కు వీడియో కాల్ చేసి తను చేసిన అప్పుల వివరాలు నోట్‌బుక్‌లో ఉన్నాయని, భూమి అమ్మి అందరి అప్పులు చెల్లించాలని కోరాడు. ఇక నుంచి ఇంటి బాధ్యతతో పాటు అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని, తాను చనిపోతున్నానంటూ వీడియో కాల్‌లో మాట్లాడుతూ పురుగుల మందు తాగాడు. అన్న మొబైల్ లొకేషన్ పరిశీలించగా పెబ్బేరులో ఉన్నట్లు తెలిసింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఫుల్లు కిక్కు..!

భారీగా పెరిగిన మద్యం విక్రయాలు

తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో అమ్మకాలు

గతేడాది కంటే 92 శాతం అధికం

161.66 శాతం పెరిగిన బీర్ల విక్రయాలు

బ్రాండెడ్ అందుబాటులోకి రావడం, ధరలు తగ్గడమే కారణం

"వైసీపీ పాలనలో పెగ్గు వేయాలంటే మద్యంబాబులు బెంబేలెత్తేవారు. బూమ్.. బూమ్.. అంటూ రకరకాల అనామక పేర్లతో మద్యం సరఫరా చేసేవారు. ధరలు మాత్రం ఆకాశాన్ని తాకేవి. విధిలేని పరిస్థితుల్లో ఆ నాసిరకం మద్యం తాగిన ఎంతోమంది ఆస్పత్రులు పాలయ్యారు. వారిలో చాలా మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి మంచానికే పరిమితమయ్యారు. కొందరు చనిపోయారు కూడా. దీంతో ఆయా కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. బతికిన వారికి కూడా ఆస్పత్రుల ఖర్చులకు ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. వారు కూడా అన్నీ కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో మందుబాబులు ఏపీ మద్యానికి భయపడి, పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చుకునేవారు. నాటుసారా విక్రయాలు కూడా విపరీతంగా సాగేవి. వెరసి.. ప్రభుత్వ మద్యం విక్రయాలు భారీగా పడిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక బ్రాండెడ్ మద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ధరలను సైతం తగ్గించింది. దీంతో మద్యం ప్రియులు పక్క రాష్ట్రాల వైపు చూడాల్సిన అవసరం లేకుండా



పోయింది. రూ.99కే ప్రీమియం క్వార్టర్ అందుబాటులోకి రావడంతో నాటుసారా విక్రయాలకు చెక్ పడింది. వెరసి.. ప్రభుత్వ మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగియి. కర్ణాటక సరిహద్దులోని కంబదూరు, కళ్యాణదుర్గం ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో జిల్లాలోనే అత్యధికంగా 2025-26 తొలి త్రైమాసికంలో బీర్ల విక్రయాలు సాగాయంటే కర్ణాటక మద్యానికి ఏ స్థాయిలో చెక్ పడిందో అర్థం చేసుకోవచ్చు. కాగా, మద్యం విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగినా.. ధరలు తగ్గించడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా పడిపోయింది."

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెగ్గు మీద పెగ్గేయ్... అంటూ మద్యంప్రియులు ఫుల్లుగా తాగేశారు. 2025-26 తొలి త్రైమాసికంలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. గతేడాది త్రైమాసికం కంటే.. ఈసారి భారీగా పెరిగాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఏకంగా 6.74 లక్షల కేసుల మద్యం అమ్ముడైంది. ఇందులో లిక్కర్ 4.24 లక్షలు, బీర్ 2.50 లక్షల కేసులు విక్రయించారు. రమారమి రూ.302 కోట్ల విలువైన మద్యం సేల్స్ జరిగాయి.

జిల్లాలో తొలి త్రైమాసికంలో మద్యం, బీర్ల విక్రయాలు ఇలా..

సర్కిల్	మద్యం విక్రయాలు	బీర్ విక్రయాలు	మొత్తం విక్రయాలు	విలువ
అనంతపురం	1,21,155	94,284	2,15,439	రూ.96.65 కోట్లు
గుత్తి	42,652	24,761	67,413	రూ.30.04 కోట్లు
గుంతకల్లు	40,331	19,826	60,157	రూ.27.66 కోట్లు
కళ్యాణదుర్గం	32,115	18,273	50,388	రూ.21.99 కోట్లు
కంబదూరు	12,672	6747	19419	రూ.8.29 కోట్లు
కణేకల్లు	18,943	7,587	26,530	రూ.12.43 కోట్లు
రాయదుర్గం	34582	14793	49375	రూ.22.16 కోట్లు
శింగనమల	40484	25905	66393	రూ.28.45 కోట్లు
తాడిపత్రి	52492	26985	79477	రూ.36.67 కోట్లు
ఉరవకొండ	28573	11066	39639	రూ.18.38 కోట్లు
మొత్తం	4,23,999	2,50,231	6,74,230	రూ.302.78 కోట్లు

తొలి త్రైమాసికంలో భారీగా...

అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెద్దఎత్తున లిక్కర్, బీర్ కేసులు విక్రయించారు. అనంతపురం ఎక్సైజ్ సర్కిల్ 2.15 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. గతేడాది 3.51 లక్షల కేసుల మద్యం మాత్రమే విక్రయించారు. 2024 ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికంలో లిక్కర్ 2.55 లక్షల కేసులు, బీర్ 95,631 కేసులు అమ్ముడయ్యాయి. మొత్తంగా 3.51 లక్షల లిక్కర్, బీర్ కేసులు విక్రయించారు. తద్వారా రూ.226.47 కోట్ల విలువైన మద్యం వ్యాపారం సాగింది. గతేడాది కంటే ఈసారి తొలి త్రైమాసికంలో భారీగా అమ్మకాలు పెరిగాయి. గతేడాది కంటే లిక్కర్ 66.03 శాతం, బీర్ 161.66 శాతం విక్రయాలు పెరగడం గమనార్హం. మొత్తంగా ఈ ఏడాది 92.08 శాతం అధికంగా విక్రయాలు సాగాయి.

బీర్లు పొంగించారు....

ఈ ఏడాది బీర్లు ఉప్పొంగాయి. యువత, మధ్యవయసు వారు భారీగా బీర్ల కొనుగోలుకు ఉత్సాహం చూపారు. గతేడాది 95,631 కేసులు మాత్రమే అమ్ముడు పోగా.. ఈసారి ఏకంగా 2.55 లక్షల కేసులు దాటించారు. అత్యధికంగా కంబదూరు సర్కిల్‌లో బీర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గతేడాది కేవలం 915 కేసులు అమ్ముడు కాగా.. ఈసారి ఏకంగా 6,747 విక్రయాలతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానంలో శింగనమల నిలిచింది. శింగనమల సర్కిల్‌లో 247.68 శాతం, కళ్యాణదుర్గం 226.54 శాతం అమ్మకాలు జరిగాయి. అనంతపురం కూడా బీర్ల అమ్మకాల్లో ఈ మూడు సర్కిళ్ల కంటే వెనుకబడటం గమనార్హం. గతేడాది కంటే ఈసారి బీర్ల అమ్మకాలు 161.66 శాతం పెరిగాయని చెప్పవచ్చు.

చరిత్రలో చిరస్థాయిగా చంద్రబాబు

నేడు హంద్రీనీవాకు నీటిని విడుదల చేయనున్న సీఎం

40 టీఎంసీలతో భవిష్యత్తుకు భరోసా

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయలసీమ ద్రోహి వైఎస్ జగన్


టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు తేవడంతో సీఎం చంద్రబాబునాయుడు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీటి ఎత్తిపోతలను గురువారం ప్రారంభించనుండడం శుభపరిణామం అన్నారు. స్థానిక రాంనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి కాలవ మీడియా సమావేశం నిర్వహించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ ఆలోచన అన్నారు. దీని ఫలాలు, ఫలితాలు పూర్తిగా అనుభవించాలన్న తాపత్రయం సీఎం నారా చంద్రబాబునాయుడిదేనన్నారు. కాంగ్రెస్ హయాంలో కొంతమేర పనులు చేసినా.. విపరీతమైన అవినీతి, అక్రమాల కారణంగా ఫలాలు అందజేదన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక హంద్రీనీవా పథకంలో కొత్త శకం ప్రారంభమైందన్నారు. అప్పట్లోనే రూ.2,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. సీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే... హెచ్ఎన్ఎస్ఎస్‌కు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి, ఒక దశకు తీసుకొచ్చారన్నారు. ఫలితంగా గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు రావడంతోపాటు కియ ఫ్యాక్టరీ ఏర్పాటైందన్నారు. 2019-24 మధ్యలో జగన్ వల్ల ఈ పథకం మళ్లీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఐదేళ్లు ప్రగతి ఊసే లేదన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం అవడంతో హెచ్ఎన్ఎస్ఎస్ పనులు పరుగులు పెట్టించారన్నారు. కూటమి ఏడాది పాలనలోనే రూ.3 వేల కోట్ల పైచిలుకు నిధులతో కాలువ వెడల్పు, 2వ దశ పనులు చేపట్టారన్నారు. 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచడమే లక్ష్యంగా పనులు పూర్తి చేసింది చంద్రబాబునాయుడేనన్నారు. ఆయనే కాలువకు నీరు వదులుతుండడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురం జిల్లా రైతుల పక్షాన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 5 దశాబ్దాల కింద 40 టీఎంసీల నీరు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా తేవాలనుకుని ఎన్టీఆర్ కలలు కనగా... నేడు చంద్రబాబు నిజం చేయబోతుండటం ఆనందంగా ఉందన్నారు. 40 టీఎంసీలు ఈ ఏడాది తెచ్చుకోగలిగితే చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాయలసీమ బిడ్డగా, ఈ గడ్డ రుణం తీర్చుకున్న నాయకుడిగా చరిత్రలో నిలుస్తారన్నారు జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ... హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కృష్ణా జలాలు తేవడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా 33 లక్షల మందికి తాగు నీరు, 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గత ఐదేళ్ల జగన్ హెచ్ఎన్ఎస్ఎస్‌కు తీరని అన్యాయం చేశారన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకుని, సీమకు తీరని ద్రోహం చేశారంటూ మండిపడ్డారు. సీఎం సంకల్పానికి ప్రకృతి సైతం సహకరిస్తోందన్నారు. శ్రీశైలం డ్యాం నిండుకుండలా ఉండటం, చంద్రబాబునాయుడు కాలువకు నీటిని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల మంజూరు వేగవంతం చేయాలి

ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ

అనంతపురం అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన రైతులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరును మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి ఆదేశించారు. ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డ్రిప్ కంపెనీల డీసీఓలు, ఎంఐ ఇంజనీర్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌పడిన డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఏడాదికి జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల మంజూరు లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ఇప్పటిదాకా 1,900 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారన్నారు. సకాలంలో పరికరాలు మంజూరు చేయడంతోపాటు సరఫరా అయ్యేలా చొరవ చూపాలని ఆదేశించారు.

చీనీ.. టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1227 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (వయా గుత్తి) ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి (నం. 07009) ప్రత్యేక వీక్లీ రైలు ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 28వ తేదీ వరకూ గురువారాల్లో సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి తిరుపతికి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఆగస్టు 1 నుంచి 29వ తేదీ వరకూ శుక్రవారాల్లో తిరుపతిలో సాయంత్రం 8.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఎనిమిదిన్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

ఘనంగా కుళ్లాయిస్వామి జార్తాలు


అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

నార్పల, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ గూగూడు కుళ్లాయిస్వామి పది రోజుల జార్తాలు కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన పది రోజులకు అగ్ని గుండానికి గ్రామంలోని ముస్లింలు పూర్తి ఫాతేహాలు నిర్వహించారు. జార్తాలు సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా అండర్-16 మల్టీ డే క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-16 మల్టీ డే బాలుర క్రికెట్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ప్రకటించారు. కెప్టెన్‌గా అనంతపురానికి చెందిన ఆర్ సాత్విక్ వ్యవహరించనున్నార. సంజయ్‌కుమార్ (నార్పల), కౌశిక్ (అనంతపురం), ఆశీష్ (అనంతపురం), తన్మయి కార్తీక్ రెడ్డి (అనంతపురం), జెయిద్ (హిందూపురం), అభినవ్ సాత్విక్‌రెడ్డి (అనంతపురం), ఆదినారాయణ రెడ్డి (ఆత్మకూరు), కుషాల్ సాయి (అనంతపురం), దేవాన్ష్ (అనంతపురం), కిరణ్‌కుమార్ (అనంతపురం), లిఖిత్ (అనంతపురం), సంతోష్ (కదిరి), అఖిల్‌కుమార్ (గొట్లూరు), నీహార్ (అనంతపురం), కార్తీక్ (అనంతపురం) జట్టులో చోటు సంపాదించారు. మహ్మద్ షోయబ్ కోచ్‌గా నియమితుడయ్యారు. ఎంపికైన జట్టు గురువారం నుంచి కడపలో నిర్వహించే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-16 టోర్నీలో పాల్గొంటుందని భీమలింగారెడ్డి తెలిపారు.

ఆరేసిన ప్రమోద్

● నెల్లూరుపై అనంత గెలుపు ● కర్నూలు, కడప మ్యాచ్ డ్రా

మల్టీ డే క్రికెట్ టోర్నీ


రోహిత్‌రోషన్


కమ్మద్దీన్


ప్రమోద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): ప్రమోద్ కుమార్ ఆరు వికెట్లతో చెలరేగడంతో మల్టీ డే క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టుపై అనంత జట్టు విజయం సాధించింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు బుధవారం మూడోరోజు స్థానిక అనంత క్రీడాగ్రామంలో ముగిశాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు ఓవర్‌నైట్ స్కోరు 243/5తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 319 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్ ప్రమోద్‌కుమార్ 6 వికెట్లతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 44.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 315 పరుగులు సాధించింది. రోహిత్‌రోషన్ హాఫ్ సెంచరీ(46 బంతుల్లో 72)లో ఆకట్టుకున్నాడు. దీంతో అనంత జట్టు 4వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కర్నూలు, కడప మ్యాచ్ డ్రా

మరో గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 105 ఓవర్లలో 459 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 74.1 ఓవర్లలో 268 పరుగులకు 7వికెట్లు కోల్పోయింది. కర్నూలు బ్యాటర్ కమ్మద్దీన్ సెంచరీ (111)తో జట్టును ఆదుకున్నాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


పెనుకొండలో ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం/పెనుకొండ రూరల్/రాయదుర్గం రూరల్/కణేకల్లు/బొమ్మనహాళ్, జూలై16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, పెనుకొండ, రాయదుర్గం పట్టణాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. కళ్యాణదుర్గంలోని శ్రీహనుమాన్, మధు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అధికారులు సాలురెడ్డి, నరేంద్ర భూపతి, బాలానాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏఓ శ్రావణ్ కుమార్ బృందంగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. రికార్డులకు, అక్కడున్న నిల్వలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు దుకాణాల్లో నిల్వ వున్న 12.570 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను నిర్వాహకులు మూసేసి, వెళ్లిపోయారు. రాయదుర్గంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేసి, రూ.2.60 లక్షల విలువ గల అనుమతులు లేని ఎరువులను గుర్తించి, వాటి విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కణేకల్లు, క్రాస్‌లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. బొమ్మనహాళ్, మండలం ఉద్దేహాళ్‌లోని శ్రీ శారదాదేవి సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. పెనుకొండలోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివన్న, ఏఓ ప్రసాద్, చందన తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో రూ.13.27 లక్షల విలువచేసే 46 క్వింటాళ్ల విత్తనాల అమ్మకాలను నిలిపేశారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

గార్లదిన్నె, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు శ్రీనాథ్‌చౌదరి కోరారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాల యంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా గృహ నిర్మాణాలకు ఉచిత ఇసుక ప్రవేశపెట్టిందన్నారు. అయితే కొంతమందికి ఇది వ్యాపారంగా మారిందన్నారు. పెన్నానది పరివాహక ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇష్టానుసారంగా ఇసుకను తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ఇసుక అక్రమ రావాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ రాముడు, సహాయక కార్యదర్శి వన్నూరు స్వామి, యువజన సమైక్య నాయకులు శర్మాస్‌వలి, కిష్ట, నల్లప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజూ కొనసాగిన సమ్మె



సప్తగిరి సర్కిల్లో మానవహారంగా ఏర్పడిన సీఐటీయూ నాయకులు, కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారానికి నాలుగోరోజుకు చేరింది. ఈ సందర్భంగా తొలుత స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీగా చేశారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఇప్పటికైనా స్పందించాలన్నారు. లేకపోతే ఈనెల 17వతేదీన మున్సిపల్ ఆర్డీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. డప్పు కళాకారులు కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, నగర అధ్యక్షుడు వెంకట నారాయణ, ఆటోయూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ప్రభాకర్ చౌదరి



లోకేశ్ నుంచి పుస్తకం అందుకుంటున్న ప్రభాకర్‌చౌదరి

అనంతపురంక్రైం,జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుం ఠం ప్రభాకర్ చౌదరి కలిశారు. ఉండవల్లిలో గల నివాసంలో బుధవారం ఆయన నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు రాజ కీయ అంశాలపై, సుపరిపాలనలో తొలి అడుగు తదితర అంశాలపై చర్చించారు. తర్వాత ది వాయిస్ ఆఫ్ పీపుల్ నారా లోకేశ్ పుస్తకాన్ని ప్రభాకర్ చౌదరికి మంత్రి అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆ ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి

గార్లదిన్నె, జూలై 16(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాం డ్ చేశారు. మండలంలోని పాత కల్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నరసింహులును ఎంఈఓలు తారా చంద్రానాయక్, వెంకటరమణ నాయక్ వేధించడాన్ని బుధవారం ఆయన వ్యతిరేకించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంకు మద్దతుగా నిలిచి మాట్లాడారు. హెచ్‌ఎం నరసింహులును ఎంఈఓలు ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆ ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజా సమైఖ్య నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతు, జేఏసీ నాయకులు ఆనంద్, జింకల మధు, ఓబులేసు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిటాల నివాసం వద్దకు సుపరిపాలనలో తొలిఅడుగు



పరిటాలసునీత, శ్రీరామ్‌కు కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం బుధవారం వెంకటాపురంలో టీడీపీ శ్రేణులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంటి వద్దకు వెళ్లారు. అక్క డ ఎమ్మెల్యేకు, యువనేత పరిటాల శ్రీరామ్‌కు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు.

ప్రభాకర్ చౌదరి కాలనీలో..



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభాకర్ చౌదరి కాలనీలో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. కక్కలపల్లి మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, సీనియర్ నాయకుడు నరసింహులు, టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా కార్మిక విభాగం నాయకుడు రాజు రాయల్ , నాయకులు అన్వర్, నరసింహులు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

అనంతపురం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాప్తాడు నియోజకర్గం బీఎల్‌ఓలకు నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంపై శిక్షణను బుధవారం నిర్వహించారు. ఇందులో ఫామ్ 6,6ఎ,7,8 గురించి శిక్షకుడు అహ్మద్ తెలియజేశారు. ఆయా దరఖాస్తు ఫామ్‌లో మార్పులు, చేర్పులు సక్రమం చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ పర్యవేక్షించారు. రాప్తాడు తహసీల్దార్ విజయకుమారి పాల్గొన్నారు.

విత్తన కందుల పంపిణీ

అనంతపురంరూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు విత్తనకందులను పంపిణీ చేపట్టారు. ఒక్కొక్కరికి 4కేజీల చొప్పున కందులను టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ రాగే మురళీ అందజేశారు. నాయకులు సూర్యప్రకాష్, పూలనాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి సామూహిక కుంకుమార్చన

అనంతపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ షష్టిని పురస్కరించుకుని బుధవారం శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో సరస్వతీ మాతకు సామూహిక కుంకుమార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని ప్రవచన మందిరంలో సరస్వతీమాత ఉత్సవమూర్తికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ దాదాపు 200 మంది విద్యార్థినులు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. మఠం కార్య నిర్వహణాధికారి సత్యప్రసాద్, అర్చకులు రామకృష్ణ శర్మ, మార్తాండ, మోహన్‌రావు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న విద్యార్థినులు

వైద్యం కోసం పడిగాపులు



ఉదయం 9:20 గంటలు అవుతున్నా ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ



డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న రోగులు



తలుపులు తెరుచుకోని మందుల గది

- ●సమయానికి కనిపించని వైద్యులు
- ●రోగులకు తప్పని అవస్థలు
- ●సీకేపల్లి కమ్యూనిటీ ఆస్పత్రిలో నిర్లక్ష్యం

ఆంధ్రజ్యోతి విజిట్

చెన్నేకొత్తపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సామాజిక(కమ్యూనిటీ)ఆస్పత్రి అది. 24గంటలు వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించే 30పడకల ఆస్పత్రి. అయితే పేరుకే పెద్దాస్పత్రి కానీ వైద్యసేవలు మాత్రం అంతంత మాత్రమని విమర్శలు ఉన్నాయి. చాలా మంది పేదలు వైద్యం కోసం నిత్యం ఈ ఆస్పత్రికి వస్తుంటారు. సీకేపల్లి మండలం నుంచే కాకుండా పక్కనే రామగిరి మండలంలోని పలు గ్రామాల నుంచి కూడా వస్తుంటారు. అంతటి ప్రాధాన్యత కల్గిన ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం రోగులను అవస్థలకు గురిచేస్తోంది. ఏ డాక్టర్ ఎప్పుడు వస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. వైద్యులకు వారికి కేటాయించిన సమయాల్లో ఆస్పత్రికి రాకపోవడం వల్ల రోగులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. స్థానిక ప్రభుత్వాస్పత్రిని బుధవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఉదయం 9గంటలు దాటినా అక్కడ కేవలం ఒక డెంటిస్ట్ మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన డాక్టర్ల కుర్చీలు ఖాళీగా కనిపించాయి. రోగులు మాత్రం డాక్టర్లు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తూ కూర్చున్నారు. అక్కడున్న పలువురు వృద్ధులను పలకరించగా చాలాసేపటి నుంచి ఇక్కడ కుర్చున్నాం.. నాయనా ఒక్కరు పలకరించేవారే లేరని నిట్టూర్చారు. ఆస్పత్రిలో దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోలు తీస్తుండగా అక్కడున్న కొందరు సిబ్బంది విషయాన్ని ఫోన్ ద్వారా డాక్టర్లకు చేరవేయడం కనిపించింది. చివరికి ఉదయం 9:30గంటలకు ఇద్దరు డాక్టర్లు నింపాదిగా విధులకు వచ్చారు. అదే సమయానికే మందులు ఇచ్చే గది తలుపులు కూడా తలుపులు తెరుచుకుంది. 9:30గంటల తరువాత వచ్చిన డాక్టర్ల సూచన మేరకు రోగులకు సిబ్బంది ఓపీ చీటీలు ఇవ్వడం ప్రారంభించారు. కాగా ఆస్పత్రి సిబ్బందిలో కొందరు తలుపులు వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ అల్పాహారం తీసుకుంటూ కనిపించారు. ప్రజల కోసం అన్ని వసతి సౌకర్యాలతో దాదాపు రూ.3కోట్లపైగా నిధులతో ప్రభుత్వం ఆస్పత్రిని నిర్మిస్తే వైద్యసేవలు అందించడంలో మాత్రం ఇంత నిర్లక్ష్యం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తాం..

ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులు ఉన్నారు. అందులో ఒకరు లీవులో ఉన్నారు. మిగిలిన ముగ్గురు విధుల్లో ఉండగా మీటింగ్ నిమిత్తం తాను పుట్టపర్తికి వెళ్లాను. విషయం తెలుసుకుని ఆరా తీయగా ఆస్పత్రిలో రోగులు ఎవరు లేరని ఇద్దరు డాక్టర్లు ఉదయం అల్పాహారం కోసం వెళ్లారని తెలిసిందన్నారు. ఇక నుంచి అలా జరగనివ్వం. ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి ఇబ్బంది లేకుండా చూస్తాం.

-జయలక్ష్మి, వైద్యాధికారి, చెన్నేకొత్తపల్లి

వ్యవసాయాన్ని సులభతరం చేసిన ఘనత చంద్రబాబుదే

- ● ఎమ్మెల్యే పరిటాల సునీత
- ● వెంకటంపల్లిలో సబ్సిడీతో డ్రోన్ అందజేత



వెంకటంపల్లిలో కుట్టుమిషన్‌ను కుడుతున్న పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని సులభతరం చేయడంతో పాటు డ్రోన్ వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో బుధవారం వెంకటేశ్వర రైతుమిత్రసంఘానికి సబ్సిడీపై డ్రోన్ పరికరాన్ని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ..డ్రోన్ ద్వారా పంటలకు మందులను సులభంగా పిచికారీ చేయవచ్చన్నారు. రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయాలని సీఎం చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రూ10 లక్షలు విలువ చేసే ఈ డ్రోన్‌ను సంఘం తరపున ఐదుగురు రైతులకు అందించడం జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వం రూ.8లక్షలు సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే అక్కడి గోకులం షెడ్డును ఆమె ప్రారంభించారు. అంతకుమును చెన్నేకొత్తపల్లిలోని కేజీబీవీలో రూ.1.60కోట్లతో వ్యయంతో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జీసీడీఓ సంపూర్ణ, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్‌నాయుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సువర్ణ, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్‌నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు అంకే అమరేంద్ర, మాడెంసూర్యనారాయణరెడ్డి,అక్కిరెడ్డి, వెంకటరెడ్డి, అక్కులప్ప,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హామీ మేరకు సంక్షేమ పథకాల అమలు..

చెన్నేకొత్తపల్లి: ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రస్తుతం లోటు బడ్జెట్ ఉన్న సంక్షేమపథకాలన్నీ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యేపరిటాల సునీత అన్నారు. వెంకటంపల్లి గ్రామంలో ఆమె సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. సాంకేతిక పరమైన ఇబ్బందుల వల్ల అర్హులకు పథకాలు అందకపోతే పరిశీలించి అందేలా చర్యలుతీసుకుంటామని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానికంగా ఓ మహిళ కుట్టుమిషన్ మీద ఉండగా ఆమెను ఆప్యాయంగా పలకరించారు. తరువాత ఎమ్మెల్యే కుట్టుమిషన్ ద్వారా దుస్తులు కుట్టి ఆకట్టుకున్నారు.

చంద్రన్న పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

●ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కరపత్రాలను అందజేస్తున్న శ్రావణి శ్రీ, ఆలం నరసానాయుడు

నార్పల, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. మండలంలోని బొమ్మకుంటపల్లిలో బుధవారం ఆమె సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. ఆయన ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం నాగార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలతో సీమకు ఊపిరి



మాట్లాడుతున్న సిమెంట్ పోలన్న

అనంతపురం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు రానుండడంతో రాయలసీమకు కొత్త ఊపిరి వస్తుందని టీడీపీ నాయకుడు సిమెంట్ పోలన్న పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం మల్యాల వద్ద నీటిని విడుదల చేయనుండటం జిల్లా రైతాంగానికి పండుగ తరుణమని తెలిపారు. 40 టీఎంసీల నీళ్లు రావడం వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగంతో పాటు, కడప, కర్నూలు, త్తూరు జిల్లాల రైతుల కష్టాలు తీరుతాయన్నారు. ఇదిని జంగా కూటమి ప్రభుత్వం ఏడాదిలో సాధించిన విజయమని పేర్కొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

ఆంధ్రజ్యోతి స్పందన

అనంతపురం న్యూటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి) విధినిర్వహణలో సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్‌ఈ ప్రభాకర్‌రెడ్డి ఈఈ కార్యాలయంలోని సిబ్బందిని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన పంచాయతీరాజ్ ఈఈ పరిపాలన విభాగానికి దిక్కెవరు..? అన్న కథనానికి ఆయన స్పందించారు. దీంతో సంబంధిత సిబ్బందితో ఈఈ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమయానికి కార్యాలయానికి ఎందుకు రాలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇలాంటివి మరోసారి రిపీట్ అయితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డీఈ గురుమూర్తిని ఆదేశించారు. అలాగే జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీరాజ్ సబ్‌డివిజన్-1 కార్యాలయంలోని సిబ్బందితో డీఈ లక్ష్మీనారాయణ సమావేశం ఏర్పాటు చేశారు. ఫీల్డ్ సిబ్బంది పనులపై వెళ్లినప్పుడు ఇక్కడ ఉన్న క్లరికల్ సిబ్బంది సమయపాలన తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు.

పొగాకు నివారణపై అవగాహన

అనంతపురం వైద్యం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని తపోవనం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీరాములు పొగాకు నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. పొగాకు వాడితే కలిగే నష్టాలను వివరించారు. ఎవరూ వాటి జోలికి వెళ్లరాదని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గార్లదిన్నె, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇల్లూరు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎగువపల్లికి చెందిన పల్లా రామకృష్ణ పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో ఇల్లూరు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఇల్లూరు పాఠశాల సమీపంలోకి రాగానే నిలబడి ఉన్న టిప్పర్ వాహన్ని ప్రమాదవశాత్తూ ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపరానికి తరలించారు.

సెలవులో పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ సుధాకర్

అనంతపురం అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ సుధాకర్ సెలవులో వెళ్లారు. ఇదివరకు ఆయన ఫారిన్ సర్వీస్ కింద పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా పనిచేసేవారు. అక్కడ ఐదేళ్ల కాలం పూర్తైంది. దీంతో మాతృసంస్థ పశుసంవర్ధక శాఖలో తిరిగి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. అయితే పదవీ కాలం పూర్తయ్యే సమయానికి మాతృసంస్థలో పోస్టింగ్ రాకపోవడంతో ఇన్‌చార్జి జేడీగా పనిచేస్తున్న సుధాకర్ రిలీవ్ కావడంతోపాటు సెలవు పెట్టారు. ఆయన జేడీ ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో జేడీ కార్యాలయంలో గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ శ్రీ లక్ష్మీకి ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు అప్పగించారు.

రేపు 'శకుని' నాటక ప్రదర్శన

అనంతపురంటౌన్, జూలై16(ఆంధ్రజ్యోతి): స్థానిక లలితకళా పరిషత్‌లో శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు 'శకుని' నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ బుధవారం ప్రకటనలో తెలిపారు. కళాకారులు, కళాభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

రాజధానిలో పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటు హర్షణీయం

అనంతపురం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో 58 అడుగుల ఎత్తు గల పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముడియం రమణ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్య సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తుండడం ఆనందదాయకమన్నారు.

అలాగే పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణమండపంలో జిల్లాలోని ఆర్యవైశ్యులంతా సమావేశమయ్యారు. పొట్టిశ్రీరాముల విగ్రహ ఏర్పాటుకు చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశప్ప, పిన్ని నాగరత్నం, గోపా మచ్చా నరసింహులు, సిరిగుప్ప వెంకటేశ్వర్లు, చల్లా కృష్ణరంగయ్య, గర్జాల నాగరాజు, శబరి వరప్రసాద్, ఓలేటి రత్నమయ్య, కృష్ణం రఘు, తాటి మధుబాబు, మల్లికార్జున, పద్మజ, టంగుటూరు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

అనంతపురంటౌన్, జూలై16(ఆంధ్రజ్యోతి): జై గణేశ భక్తి సమితి రాష్ట్ర కార్యవర్గ సలహాదారుడిగా, జిల్లా ఇన్‌చార్జిగా సాయి ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ విజయసాయికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జైన్ కుమార్ బుధవారం ప్రకటనలో వెల్లడించారు. ఆధ్యాత్మిక, భక్తి భావాలను పెంపొందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుల ప్రతిష్టను ప్రోత్సహిస్తున్నందుకు గాను విజయసాయికుమార్‌కు సమితి రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

రామగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): పేరూరు గ్రామంలోని ఎరువుల దుకాణాలను పుంగనూరు ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌ఆఫ్ పోలీస్ శివన్న, వ్యవసాయ అధికారులు ప్రసాద్, కవిత బుధవారం తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో మూల ధృవీకరణ పత్రం లేకపోవడంతో రూ.5.6లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దుకాణదారులు అన్ని నిబంధనలు పాటించి అమ్మకాలు జరపాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేషన్ షాపుల్లో తనిఖీ



రేషన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారి వెంకటేశ్వర్లు

శింగనమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 28, 29వ రేషన్‌షాపులను జిల్లా పౌర సరఫరాల అధికారి టీ. వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. అక్కడి స్టాకు వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. కొందరు లబ్ధిదారులు కంది బేడలు, జొన్నలు పంపిణీ చేయలేదని తెలిపగా.. అవి ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకే సరఫరా అయ్యాయని, ఇక్కడికి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని అన్నారు. వీఆర్‌ఓ ఎర్రితాతయ్య, డీలర్లు రాయల్‌సత్తి, గొల్ల శివ,రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న మండలకేంద్రంలోని బుడగజంగాల కాలనీకి చెందిన శ్రీనివాసులు (45) మృతి చెందాడు. శ్రీనివాసులు గ్యాస్‌స్టవ్‌లు రిపేరీ చేసి జీవనం సాగించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని భార్య మందలించడంతో గత రెండు రోజులు క్రి తం ఇంట్లో విషపుద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యు లు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బు దవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని ద ర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి ఆరుగురు సంతానం ఉన్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి గ్రామంలో గత మూడు రోజుల క్రితం ఆటో బోల్తాపడి గాయపడిన లింగమయ్య(39) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన లింగమయ్య ఆటోడ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. ఈ నెల 13వ తేదీన నాయనపల్లి క్రాస్‌కు వ్యక్తిగత పనిమీద ఆటోలో బయలుదేరాడు. రెడ్డిపల్లి వద్ద పంది అడ్డం రావడంతో తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లింగమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అనంతపురం ఆస్పత్రికి తరలించగా.. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరుపిల్లలు ఉన్నట్లు చెప్పారు.

అయ్యవారిపల్లికి చెందిన మరొకరు..

రాప్తాడు: అయ్యవారిపల్లికి చెందిన కత్తే ఎర్రిస్వామి (44) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎర్రిస్వామి గత సోమవారం రాత్రి మొహర్రం పండగకు గొందిరెడ్డిపల్లికి బైక్‌లో వెళ్లాడు. కొద్దిసేపటి అనంతరం స్వగ్రామానికి వస్తుండగా.. మార్గంమధ్యలో అదుపుతప్పి కింది పడ్డాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

న్యాయవాదుల ర్యాలీ

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ర్యాలీ జరిగింది. మధ్యవర్తిత్వం 90 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్ నుంచి క్లాక్‌టవర్ వరకూ డీఎస్‌ఎల్‌ఏ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌ఎల్‌ఏ కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన క్యాంపెయిన్ సెప్టెంబరు 30 వరకూ ఉంటుందన్నారు. న్యాయవాదుల సంఘం జిల్లాధ్యక్షుడు గురుప్రసాద్, న్యాయవాదులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు, డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులతో పరిటాల శ్రీరామ్ సమావేశం

రామగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పంచాయతీ రాజ్ గెస్ట్‌హౌస్‌లో బుధవారం టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులు, బూత్ కన్వీనర్‌లు, కేఎస్‌ఎస్ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ రెండు మండలాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఎంతవరకు వచ్చిందని ఆరాతీశారు. కొన్నిచోట్ల 90 శాతం రావడంతో అభినందించారు. తక్కువశాతం ఉన్న వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా చర్చించారు. ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయవద్దని సూ చించారు. సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర్, ఆవుల ముత్యాలు,ముత్యాల్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై చర్చ

నార్పల, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బూసి నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలువురు సభ్యులు గ్రామాల్లోని వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ... ఈనెల 20న అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో పడే అవకాశం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ మమతా దేవి, సర్పంచ్ సాకే రామాంజినేయులు, ఎంఈఓ నారపరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మంచి పద్ధతి కాదు

శింగనమల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులపై కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని.. రాష్ట్ర నాయిబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, శింగనమల చెరువు ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్, విద్యాకమిటీ చైర్మన్ సురేష్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తల్లి లీలావతి షాడో ఎమ్మెల్యే అని, ఆమె కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని సోషల్ మీడియాలో టీడీపీకే చెందిన కొందరు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. వారు వైసీపీకి కోవర్టులుగా మారి అలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే అందుబాటు లేని సమయంలో లీలావతి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందజేస్తున్నారన్నారు. ఇప్పటికైన అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుకు కష్టాలు

● ఖర్చు ఎక్కువ.. ఆదాయం తక్కువ
● పశువులను కబేళాలకు అమ్మి అప్పులు తీరుస్తున్న వైనం

బొమ్మనహాళ్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు, పాడి రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. పశుగ్రాసం నుంచి దాణా వరకూ అన్ని ధరలు పెరిగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పో సొప్పో చేసి అవన్నీ కొనిపెట్టినా... పాలకు గిట్టుబాటు ధర రావడం లేదు. పోని పాడిని మరో రైతుకు అమ్ముకుందామన్నా అందరిదీ అదే పరిస్థితి. ఫలితంగా మరో మార్గం లేక పశువులను కబేళాలకు తరలించి దళారులు ఇచ్చిన డబ్బుతో అప్పులు తీర్చుకొంటున్నారు. పశు దాణా ధరలు పెరగడం, ప్రస్తుత యాంత్రీకరణతో పశుగ్రాసం లభించకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం అంతగా లేకపోవడం.. తదితర కారణాలతో పాడిపోషణ భారంగా మారింది.

మండలంలో దాదాపు రెండు వేలు ఆవులు, గేదెలు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 3200 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. ప్రభుత్వం ఈ ఏడాది 50శాతం సబ్సిడీపై పశు దాణా ఇస్తున్నా సరిపోవడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. ఐదు ఆవులు ఉన్న రూ. 800 వరకు ఆదాయం వస్తుంది. దాణాకు రూ.200 ఒక మనిషి కూలి రూ.300 పోగా ఇతర ఖర్చులు కలిపితే రైతుకు ఏమి మిగలడం లేదని వాపోతున్నారు.


ఉద్దేహాళ్‌లో పాడి పశువుల క్షేత్రం

గిట్టుబాటు ధర కల్పించాలి



చాలాకాలంగా పాడిని నమ్ముకొని జీవ నం సాగిస్తున్నాం. ప్రస్తుతం 40పైగా ఆవులు ఉన్నాయి. ప్రభుత్వ పాల డెయిరీ లేక పోవడంతో ప్రైవేట్ డెయిరీలకు విక్రయిస్తున్నాం. గతంలో లీటర్ పాలు ధర రూ. 36 కొనేవారు. సాంద్రత తక్కువగా ఉందన్న పేరుతో రూ. 34తో కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిట్టుబాటు కావడంలేదు. ప్రభుత్వ పాలశీతల కేంద్రం ఏర్పాటు చేసి గిటుబాటు ధరతో పాలను కొనుగోలు చేయాలి.

- నాగమల్లీశ్వరి, ఉద్దేహాళ్

హోటల్ పెట్టుకున్నా..



మూడేళ్ల కిందట 10 ఆవులు ఉండేవి. ఖర్చులు భరించలేక వాటిని అమ్ముకొని హోటల్ నడుపు కొంటున్నా. పాలకు గిట్టుబాటు ధర లేక అప్పులు చేసుకొన్నాం గత ప్రభుత్వం హయాంలో రెండు ఆవులు చనిపోయినా బీమా రాలేదు. ఇక నష్టం భరించలేక పాడి పరిశ్రమతో ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం చనిపోయిన ఆవులకు బీమా డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి.

- వంశీకృష్ణ, ఉప్పరాహాల్

సబ్సిడీపై పశుదాణా

పాడిరైతులకు 50 శాతం సబ్సి డీపై పశుదాణాను పంపిణీ చేస్తున్నాం. ఈ ప్రాంత పాడి రైతులు ఎండుగడ్డి, దాణా మాత్రమే వేస్తున్నారు. పచ్చ గడ్డి వేయడం లేదు. మండలంలో 500 ఎకరాలల్లో యానివల్స్ గ్రాసం, 65 ఎకరాలల్లో బహు వర్షగ్రాసం సాగుకు ప్రణాళిక రూపొందించాం.

- వెంకటరెడ్డి, పశువైద్యాధికారి బొమ్మనహాళ్

గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'


నూతిమడుగులో టీ తాగుతూ సమస్యలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అమిలినేని


మాల్యంలో టీడీపీ నాయకుల ప్రచారం

కంబదూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం, నూతిమడుగు, కర్తనపర్తి గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నిర్వహించారు. నూతిమడుగ బస్టాండ్ సమీపంలోని టీ స్టాల్ వద్ద టీ తాగుతూ సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నాగేశ్వరయాదవ్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

● కణేకల్లు : మండలంలోని మాల్యంలో టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్నినిర్వహించారు. టీడీపీ నాయకులు ఉప్పర ప్రభాకర్, శరభనగౌడ్, కురుబ సూర్యవంద్ర, కురుబ హరి, డీలర్లు ఆదినారాయణ, ఎల్లప్ప, బోయ నాగరాజు, రామన్న పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ అందజేత


సొరకాయలపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

పామిడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొరకాయలపేటలో రాయితీపై రైతులకు మందులు పిచికారి చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన డ్రోన్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. దాదాపు 80 శాతం రాయితీతో పంటకు మందులను పిచికారి చేసేందుకు డ్రోన్‌లను ప్రభుత్వం అందజేస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సొరకాయలపేటలో సుపరిపాలకు తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌చౌదరి, గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, శ్రీనివాసులు, సురేష్ రెడ్డి, రామాంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ల కోసం తవ్వకాలు

రోడ్లను అలాగే వదిలేయడంతో వాహనదారులకు అవస్థలు


పైప్‌లైన్ వేయడంతో అధ్వానంగా మారిన రోడ్లు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అమృత్ పథకం, ఇతర నిధులతో పలు చోట్ల తాగునీటి పైపులైన్లను నిర్మించారు. పైప్‌లైన్ ఏర్పాటు కోసం రోడ్లను తవ్వేశారు. అయితే పని పూర్తయిన తర్వాత రోడ్లను మళ్లీ నిర్మించకుండా.. కేవలం మట్టితో గుంతలను పూడ్చి చేతులు దులిపేసుకున్నారు. పట్టణంలో ఏడేళ్ల కింద అమృత్ రెండో విడత నిధులతో పట్టణంలోని మండీ బజార్, కసాపురం రోడ్డు, మస్తాన్‌పేట రోడ్డును తవ్వి తాగునీటి లైన్లను నిర్మించారు. అలాగే నాలుగు నెలల క్రితం ధర్మవరం గేటు సమీపం నుంచి గుంతబావి వరకూ సిమెంటు రోడ్డును తవ్వి పైపులైన్ వేశారు. ప్రస్తుతం రోటరీ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు వరకూ సీసీ రోడ్డును పగులగొట్టి పైప్‌లైన్ నిర్మించారు. అదేవిధంగా పోర్టర్స్ లైన్ వద్ద రోడ్లను తవ్వారు. పని పూర్తయిన తర్వాత రహదారిని యథా స్థితికి వచ్చేలా మరమ్మత్తులు చేయాల్సి ఉంది. అమృత్ పథకం కింద పైప్‌లైన్ వర్కుల్లో రోడ్లను పునర్నిర్మించేలా అంచనాలను రూపొందించారు. కానీ తవ్విన రోడ్లను మట్టితో పూడ్చి వదిలేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి.

రేపు విద్యుత్ అదాలత్

తాడిపత్రి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసపురంలో ఉన్న సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఇందు లో విశ్రాంత న్యాయాధికారి ఆంజనేయమూర్తి హాజరవుతారన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

ఉరవకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గది కప్పు పెచ్చులు ఊడి పడుతుండటంతో పాఠకులు, అధికారులు గ్రంథాలయంలోకి వెళ్లడానికే ఇబ్బందులు పడుతున్నారు. పెచ్చులూడటంతో పైకప్పు ఇనుపకడ్డీలు కనిపిస్తున్నాయి. గతంలో గ్రంథాలయానికి పంచాయతీ క్వార్టర్స్‌లో స్థలాన్ని కేటాయించారు. భవన నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని పాఠకులు కోరుతున్నారు.


పెచ్చులు ఊడటంతో కనిపిస్తున్న ఇనుపకడ్డీలు

ముగిసిన మొహర్రం


కూడేరు, రాయదుర్గంలో పీర్లస్వాముల ఊరేగింపు

కూడేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరుట్లపల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు బుధవారంతో ముగిశాయి. తెల్లవారుజామున పీర్లస్వాములను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం పీర్లస్వాములను అగ్నిగుండం ప్రవేశం అనంతరం జలధికి తరలించారు.


● రాయదుర్గంరూరల్ : స్థానిక రాజీవ్‌గాంధీకాలనీ, శాంతినగర్, జేఆర్ఎస్ కాలనీ, దుగ్గిలమ్మ గుడి ఏరియా, ఊరువాకిలి తదితర ప్రాంతాల్లో బుధవారం చిన్నపీర్లు ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భాగవత సప్తాహంలో భాగంగా బుధవారం లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాటుకు విశేష పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు లక్ష్మీనారాయణ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్, సెక్రెటరీ కృపాకర్, కోశాధికారి మేడం వెంకటేశ్వర్లు, పూజ కమిటీ చైర్మన్ పరుచూరు సత్యరంగయ్య, సభ్యులు జయంతి వెంకట్, రాజారమణ, శ్రీనాథ్, చక్కజగన్, చెన్నకేశవులు, గుండా విజ్జిపేరకం సురేష్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి

గుత్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు రాజీ కావడం ద్వారా కేసులను త్వరగా పరిష్కరించుకోవడమే కాకుండా.. ఆర్థిక ఇబ్బందులూ తొలగుతాయని స్థానిక సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీ విశ్వనాథాచారి సూచించారు. దీనిపై అవగాహన కల్పిస్తూ న్యాయవాదులు ఆయన ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణం నుంచి గాంధీ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీడీ రత్నం, సీనియర్ న్యాయవాదులు మనోహర్‌బాబు, ఏజీపీ ఫక్రుబాషా, న్యాయవాదులు పాల్గొన్నారు,

రోడ్లను బాగు చేయండి : సీపీఐ

బ్రహ్మసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రోడ్ల అధ్వానంగా ఉన్నాయని, వాటిని బాగు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మండలం ముద్దలాపురంలో బుధవారం జరిగిన సీపీఐ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. సుపరిపాలకు తొలి అడుగులో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు ఈ రోడ్ల దుస్థితి కనిపించలేదా ప్రశ్నించారు. కళ్యాణదుర్గం కన్నేపల్లి రోడ్డు కోసం నిరాహార దీక్ష చేశామని, ఇప్పటికీ తారు రోడ్డు వేసిన పాపాన పోలేదని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా ప్రకాష్, సహాయ కార్యదర్శిగా శివశంకర్, 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి నరసింహులు, మండల కార్యదర్శి నాగరాజు నాయక్, నాయకులు రాంబాబు, ఈరణ్ణ, నాగభూషణ, నాగరాజు పాల్గొన్నారు.

కళాశాల తనిఖీ

రాయదుర్గంరూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వృత్తి విద్య ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ స్థానిక జూనియర్ కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. అమ్మపేరుతో మొక్కలు నాటారు.

న్యూస్ బాక్స్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బదిలీ చేయొద్దు

గుంతకల్లు టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను శానిటేషన్ విభాగంలోకి బదిలీ చేయరాదని ఆలయ ఏఈఓకు బుధవారం సీపీఎం నాయకులు విన్నవించారు. ఆలయంలో కొన్నేళ్లుగా దేవదాయ కమిషనర్ ఆర్డర్‌పై వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 21 మందిని శానిటేషన్ విభాగంలోకి మార్చడం సరైన పద్ధతి కాదని, అలా చేస్తే కమిషనర్ ఆర్డర్లను వ్యతిరేకించినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సభ్యులు సురేంద్ర, తిమ్మప్ప, బాష పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టని పాలకులు

బొమ్మనహాళ్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తమకేమీ పట్టవ్ అన్నట్లు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు వ్యవహరిస్తున్నారు. తమకు రావాల్సిన 21 నెలల గౌరవ వేతనం ఇవ్వాలని మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని వారు బాయికాట్ చేసిన విషయం తెల్సిందే. 10 నెలల గౌరవ వేతం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వైసీపీ ఎంపీటీసీలు బుధవారం సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అయితే వారు ఏ ఒక్క ప్రజా సమస్యనూ సమావేశం దృష్టికి తీసుకురాలేదు. అధికారులు చదివిన రిపోర్టులను విని వెళ్లిపోయారు. వారి గౌరవ వేతనం పై ఉన్న ఆసక్తి.. ప్రజా సమస్యలపై కొంతైనా చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బొప్పాయికి మొజాయిక్ వైరస్

ఉరవకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): బొప్పాయికి మొజాయిక్ వైరస్ సోకిందని, నివారణకు థయోమిథాక్సమ్ ఒక గ్రామును లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలని ఏఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని మైలారంపల్లి, రాచపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చీని మొక్కలకు జింకు, బోరాన్ లోపం ఉందని, వీటి నివారణకు రెండు గ్రాముల జింకుకు లీటర్ నీటిని కలిపి, ఫార్ములా-4ను రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

● విడపనకల్లు : ఎండ బెట్టకు తటుకుని కంది పీఆర్జీ 176, ఎల్ఆర్జీ 105 రకాలు అధిక దిగుబడిని ఇస్తాయని, వర్షాలు అంతంత మాత్రం ఉన్నా వీటికి తట్టుకునే శక్తి ఉంటుందని ఏఈఓ కైలాష్ తెలిపారు. మండలంలోని వేల్పుమడుగు, కరకముక్కల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

తాడిపత్రి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం నాలుగో రోజుకు చేరింది. సీఐటీయూ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం నుంచి అశోక్‌పిల్లర్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు.ఇందులో జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

● గుత్తి: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆకులు తింటూ నిరసన వ్యక్తంచేశారు. ఇందులో కార్మిక సంఘ నాయకులు రామాంజినేయులు, రాజ్‌కుమార్, మురళీ, రవిశంకర్ పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో అగ్రికల్చర్ భూములను, నాన్ అగ్రికల్చర్ భూములుగా మార్చకుండానే అనధికార లేఅవుట్‌లు వేశారని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు కౌకుంట్ల రవి కోరారు. ఈవిషయాన్ని స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గౌస్ దృష్టికి బుధవారం తీసుకెళ్లారు. మేజరు పంచాయతీకి ప్రజా ప్రయోజనాల కోసం స్థలాలను వదలడం లేదని, దీంతో రాబోవు రోజుల్లో గుడి , బడి నిర్మించుకునేందుకు కూడా వీలులేకుండా పోతుందని, తక్షణమే ఆ అక్రమ లేఅవుట్‌లు వేసిన వారికి నోటీసులు పంపాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

తాడిపత్రి, జూలై 16(ఆంధ్రజ్యోతి): యాడికి, పెద్దపప్పూరు మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణపై ఉపాధి విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టి.. వారికి నోటీసులు ఇచ్చారు.

ఈఓఆర్డీగా అశ్వత్థమనాయుడు

పామిడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈఓఆర్డీగా అశ్వత్థమనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఈఓఆర్డీ కృష్ణకుమార్ సస్పెండ్ కావడంతో పామిడి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న అశ్వర్థమనాయుడిని ఉద్యోగోన్నతిపై ఈఓఆర్డీగా నియమించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పామిడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ షర్మిల హామీ ఇచ్చారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

గుత్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం శ్రీరామ్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఏ1 బార్ రెస్టారెంట్‌ను తనిఖీ చేసి రసాయనిక పరీక్ష నిమిత్తం మద్యం శ్యాంపిల్స్‌ను సేకరించారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ప్రవేశానికి ఈ నెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ బద్రీనాథ్ తెలిపారు. డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటర్ వెహికల్ మెకానిక్, కంప్యూటర్ (కోపా) కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దోబీ ఘాట్‌ను ఏర్పాటు చేయండి

యాడికి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో దోబీ ఘాట్ ఉందని, దీంతో రజకులు ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని గ్రామ సమీపంలోనే ఏర్పాటు చేయాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు కోరారు. ఈ మేరకు ఆయన యాడికి సుబ్బరాయుడు, తరుణ్‌కుమార్‌తో కలిసి .. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి బుధవారం వినతిపత్రాలు అందజేశారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

ఉరవకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టు కార్డుల ఉద్యమాన్ని బుధవారం చేపట్టారు. ఈ మేరకు ప్రతి మండలం నుంచి 1600 పోస్టు కార్డులను విద్యార్థులతో రాయించి.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గోపాల్, చంద్రశేఖర్, ఆర్డీటీ ఉపాధ్యాయులు మారెన్న తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

రేషన్ బియ్యం సీజ్

యాడికి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 5.4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆటోను కూడా సీజ్ చేసి.. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇంట్లో చోరీ

గుత్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్ పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ వాచ్‌మన్ తిమ్మప్ప ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. 60గ్రాములు బంగారు, రూ.13వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కేబుల్ వైర్..

యాడికి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లిలో రైతు రంగారెడ్డి తోటలోని రూ.8వేలు విలువైన 30 మీటర్ల కేబుల్ వైర్‌ను దుండగులు బుధవారం చోరీ చేశారు. మండలంలో ఇటీవల కేబుల్‌వైరు దొంగతనాలు అధికమయ్యాయని, పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆటోలు ఢీ

పెద్దపప్పూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామ అటవీ సమీపాన బుధవారం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ ఆంజనేయులుకు చేయి, కాలుకు గాయాలయ్యాయి. అతన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చేనేతలకు పనిముట్లు అందజేత


మహిళా కార్మికులకు పనిముట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక దివాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాలులో చేనేత కార్మికులకు బుధవారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి చేనేత పనిముట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దవడుగూరు, విరుపాపురం, ఆవులాంపల్లి, చిన్నవడుగూరు, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని 156 మంది చేనేత లబ్ధిదారులకు త్రీ లీవర్ లిఫ్టింగ్ మిషన్లు, టూ లీవర్ లిఫ్టింగ్ మిషన్లు, ఫ్రేమ్ రూములు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళీ శాఖ అధికారి వరప్రసాద్, తహశీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ బారెన్‌సాబ్, ఏపీడీ పుల్లారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరశురాముడికి నివాళి


నివాళులర్పిస్తున్న కాలవ, వెంకటశివుడు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీపీఆర్ ట్రస్టు అధినేత తలారి పరశురాముడి మృతదేహానికి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, గుమ్మనూరు నారాయణ స్వామి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

తల్ సైనిక్ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

కూడేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఎన్‌సీసీ విద్యార్థులు తల్ సైనిక్ క్యాంపునకు ఎంపిక చేశారు. బుధవారం కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్‌లో 28 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో 650 మంది విద్యార్థులకు పది రోజుల పాటు జరిగిన శిక్షణలో ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు. వారికి కర్నూల్ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ పార్టీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ నరసింహ సేలాని ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నెట్టికంటి సేవలో రాజంపేట ఎమ్మెల్యే


ఆలయంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

గుంతకల్లు టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి స్వామిని అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎస్పీ పల్లె నిద్ర


మాట్లాడుతున్న ఎస్పీ

శెట్టూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : ఎస్పీ జగదీష్ మండలంలోని అనుంపల్లిలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఘర్షణలకు దూరంగా ఉండి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, సీఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపులో అక్రమాలు: ఏఐఎస్‌ఎఫ్

రాయదుర్గంరూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సీట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, దానిపై విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు బుధవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఆయా పాఠశాల సిబ్బంది, రాజకీయ నాయకుల జోక్యంతో సీట్లు కేటాయించారని, దీంతో అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. దీనిపై దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు తరుణ్, మున్న, రామ్ పాల్గొన్నారు.